# మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక




ఘనంగా పల్లా
## జన్మదినం
- అన్నదానం చేసిన బీఆర్ ఎస్ కార్యకర్తలు

2

సంపుటి : 01 | సంచిక : 219 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | ఆదివారం, 12 జులై 2026 | పేజీలు :4



# జనావాసంలో అక్రమ కబేళా

- మున్సిపల్ దాడి.. రూ.1 లక్ష జరిమానా..

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ పట్టణంలోని జనావాస ప్రాంతంలో కరన్ లాల్‌కు చెందిన అక్రమ వధశాలపై మున్సిపల్ కమిషనర్ సీహెచ్. రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో మేరకు మున్సిపల్ అధికారులు దాడి నిర్వహించారు. అక్రమంగా మేకలు, గొర్రెలను వధిస్తున్నట్లు గుర్తించిన అధికారులు రూ.1 లక్ష జరిమానా విధించారు. అక్కడ ఉన్న మాంసాన్ని సీజ్ చేసి స్వాధీనం చేసుకున్నారు. జనావాసాల్లో అనుమతి లేకుండా వధశాలలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజారోగ్యానికి హాని కలిగించే కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని మున్సిపల్ అధికారులు హెచ్చరించారు.





భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే

# భూ రీ-సర్వే లక్ష్యం

- మార్చి-2027 నాటికి మూడు విడతల్లో సర్వే పూర్తి చేయాలి
- పనిచేసే లైసెన్స్ సర్వేయర్లకు ఎకరానికి రూ.60 చెల్లింపు
- సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారాన్ని స్పీడప్ చేయాలి
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, డబుల్ బెడ్ రూం ఇండ్ల పంపిణీని వేగవంతం చేయాలి
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి




2 లో




## భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే

# భూ రీసర్వే లక్ష్యం

- మార్చి-2027 నాటికి మూడు విడతల్లో సర్వే పూర్తి చేయాలి
- పనిచేసే లైసెన్స్ సర్వేయర్లకు ఎకరానికి రూ.60 చెల్లింపు
- సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలి
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి

**జనగామ, మన చౌరాస్తా :** భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు భూ భారతి చట్టం సమర్థవంతంగా అమలు కావాలంటే రాష్ట్ర వ్యాప్తంగా భూ రీసర్వేను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. భూ రీసర్వే, భూ భారతి అమలు, సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం, ఇందిరమ్మ ఇండ్లు, రెండు పడక గదుల ఇళ్ల పంపిణీ, విద్యార్థుల యూనిఫాంల పంపిణీ, తదితర అంశాలపై రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శనివారం, ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. హైదరాబాద్ నుంచి రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వీపీ గౌతమ్, సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోం తో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఈ వీడియో సమావేశానికి హాజరయ్యారు. ఈ నేపథ్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ధరణిని రద్దు చేసి భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామని, రైతుల భూములకు పూర్తి భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. భూ భారతి అమల్లోకి వచ్చి 15 నెలలు పూర్తయినా ప్రజల అంచనాలకు పూర్తి స్థాయిలో చేరలేకపోయామని తెలిపారు. ధరణి కాలంలో పెండింగ్‌లో ఉన్న 9.6 లక్షల సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం కోసం భూ భారతిలో అవకాశం కల్పించి, హైకోర్టు సమస్యలను పరిష్కరించినప్పటికీ, అధిక సంఖ్యలో దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నాయనే అభిప్రాయం ప్రజల్లో ఉందన్నారు. తిరస్కరణలకు గల కారణాలను గుర్తించి, నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. భూ భారతి చట్టం సమర్థవంతంగా అమలు కావాలంటే భూ రీసర్వే తప్పనిసరి అని మేధావులు సూచించడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఇందుకోసం శిక్షణ పొందిన 5,700 మంది లైసెన్స్ సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలని, రెగ్యులర్ సర్వేయర్లు, లైసెన్స్ సర్వేయర్లు సమన్వయంతో పని చేయాలని సూచించారు. లైసెన్స్ సర్వేయర్లకు ఉద్యోగం (లేదా) రెగ్యులరైజేషన్ హామీ ఇవ్వలేదని స్పష్టం చేశారు. పైలట్ ప్రాజెక్టుగా



నక్షాలు లేని 413 ప్రాంతాల్లోని ఐదు గ్రామాల్లో నిర్వహించిన రీసర్వేతో 95 శాతం వరకు భూ సమస్యలు పరిష్కారమయ్యాయని తెలిపారు. శుక్రవారం, ముఖ్యమంత్రి ఆయా గ్రామాల రైతులకు కొత్త పట్టాదారు పాస్‌బుక్‌లు పంపిణీ చేశారని గుర్తు చేశారు. తొలి విడతలో ప్రతి జిల్లాలో 70 గ్రామాలను ఎంపిక చేసి రీసర్వే చేపడుతున్నట్లు తెలిపారు. రీసర్వేకు అవసరమైన అత్యుత్తమ నాణ్యత గల పరికరాలను జిల్లా స్థాయిలో కొనుగోలు చేయాలని, కొనుగోలు ముందు రాష్ట్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. కలెక్టర్లు భూ రీసర్వేను అత్యంత ప్రాధాన్యత అంశంగా తీసుకొని, అవసరమైన సిబ్బంది, పరికరాలు, మౌలిక వసతులు సమకూర్చాలని ఆదేశించారు. ప్రతి నెల వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, పురోగతిని సమీక్షిస్తామని, మార్చి 2027 నాటికి మూడు విడతల్లో రీసర్వే పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రీసర్వేలో పనిచేసే లైసెన్స్ సర్వేయర్లకు ఎకరానికి రూ. 50తో పాటు రవాణా, ఇతర ఖర్చుల కోసం మరో రూ.10 చెల్లించి మొత్తం రూ.60 అందజేస్తామని తెలిపారు. చెల్లింపులు వెంటనే జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. జూలై 28లోపు విధుల్లో చేరని లైసెన్స్ సర్వేయర్ల లైసెన్సులు రద్దు చేయాలని ఆదేశించారు. వారికి బీమా, సామాజిక భద్రత కల్పించే చర్యలు కూడా తీసుకుంటామని వెల్లడించారు. ఒక సర్వే నంబరులో కొంత భూమి మాత్రమే ప్రభుత్వ అవసరాలకు సేకరించినప్పటికీ మొత్తం భూమిని నిషేధిత జాబితాలో ఉంచడం వంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. సాదాబైనామా దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిష్కరించి, నోటీసులు త్వరితగతిన జారీ చేయాలని సూచించారు.

పాలేరు నియోజకవర్గంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో వచ్చిన 6,500 రెవెన్యూ సమస్యల్లో 98 శాతం సమస్యలకు భూ రీసర్వేతో శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని, పెండింగ్‌లో ఉన్న 2బీహెచ్‌కే ఇళ్లను ప్రస్తుత స్థితిలోనే లబ్ధిదారులకు అందజేసి, మిగిలిన పనులకు అనంతరం నిధులు విడుదల చేయాలని ఆదేశించారు. నిధులు విడుదలైనా పనులు చేపట్టని చోట్ల బాధ్యులైన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని స్పష్టం చేశారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికను వెంటనే పూర్తి చేసి గుడిసెల్లో నివసించే కుటుంబాలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని, మొదటి విడతలో మంజూరు కాని అర్హుల ఇళ్లను కూడా రెండో విడతలో చేర్చి మంజూరు చేయాలని సూచించారు. ఇసుక, కంకర సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. క్రమంలో రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్ మాట్లాడుతూ.. తొలి విడతలో ఎంపిక చేసిన 70 గ్రామాల్లో భూ రీసర్వేను నవంబర్‌లోపు పూర్తి చేయాలని, రెండో విడతలో మరో 70 గ్రామాల్లో మార్చి 2027లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. రీసర్వే పూర్తయితే సాదాబైనామా దరఖాస్తుల తిరస్కరణలు గణనీయంగా తగ్గే అవకాశం ఉంటుందని తెలిపారు. అదే విధంగా తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ విపి గౌతమ్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో సుమారు 41 వేల గుడిసెలను గుర్తించామని, అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేసి ఆగస్టు నాటికి రెండు లక్షల ఇళ్ల లక్ష్యాన్ని చేరుకోవాలని, పెండింగ్‌లో ఉన్న రెండు పడక గదుల ఇళ్లను వెంటనే లబ్ధిదారులకు అప్పగించాలని సూచించారు. అలాగే సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల విద్యార్థుల ఏకరూప దుస్తులన్నీ స్వయం సహాయక సంఘాల మహిళా టైలర్ల ద్వారానే కుట్టిస్తున్నామని తెలిపారు. టెండర్ ఆలస్యంతో వస్త్రం ఆలస్యంగా వచ్చినప్పటికీ జూలై 15లోపు రెసిడెన్షియల్ బాలికలకు, జూలై 30లోపు బాలురకు యూనిఫాంలు అందించాలని సూచించారు. ఆగస్టు 15 నాటికి రాష్ట్రంలోని ప్రతి విద్యార్థికి కనీసం ఒక జత యూనిఫాం అందేలా కలెక్టర్లు, డీఆర్‌డీఏ, గురుకులాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా 26 వేల మంది శిక్షణ పొందిన స్వయం సహాయక సంఘాల టైలర్లు ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ మన్యంకొండ, తదితరులు పాల్గొన్నారు.





## కడియంను కలిసిన కొత్తపల్లి సొసైటీ

**లింగాలఘణపురం, మన చౌరాస్తా :** నూతనంగా ఎన్నికైన వెంకటేశ్వర HWCS కొత్తపల్లి సొసైటీ పాలకవర్గం శనివారం స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో జనగామ వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ కొల్లూరి నర్సింహులు (శివకుమార్ ), జిల్లా కాంగ్రెస్ నాయకులు బిట్ల బాబు గారు, వెంకటేశ్వర HWCS కొత్తపల్లి సొసైటీ అధ్యక్షులు చిటుకుల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు బిట్ల ఆంజనేయులు, డైరెక్టర్లు కందగట్ల సుదర్శనం, బేతి చంద్రమౌళి, గుమ్మడివెల్లి రవికుమార్, వంగ సుధాకర్, వంగ లక్ష్మి, మహేశ్వరం భాగ్యమ్మ, మండల కాంగ్రెస్ సోషల్ మీడియా కన్వీనర్ దేవరాయ రాజు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా ఎమ్మెల్యే పల్లా జన్మదిన వేడుకలు

### జనగామలో అన్నదాన కార్యక్రమం

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ శాసనసభ్యులు, అభివృద్ధి ప్రదాత డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు స్థానిక రైల్వే స్టేషన్ వద్ద అత్యంత ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ధర్మపురి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా ధర్మపురి శ్రీనివాస్ మాట్లాడుతూ, పల్లా రాజేశ్వర్ రెడ్డి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, ప్రజలకు మరిన్ని సేవలందించే శక్తిని భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు. నియోజకవర్గ అభివృద్ధిలో ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని, రాబోయే కాలంలో ఆయన మరిన్ని ఉన్నత పదవులను అధిష్టించి, ప్రజాసేవలో దూసుకుపోవాలని కోరారు.ఈ అన్నదాన కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, యూత్ నాయకులు, మైనార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన సర్పంచ్



**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** భీమదేవరపల్లి గ్రామంలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా బిఎల్ఓలు, బిఎల్ఎ2లు నిర్వహిస్తున్న పనితీరును గ్రామ సర్పంచ్ మాచర్ల కుమారస్వామి పరిశీలించారు. ఓటర్ల వివరాల సేకరణ, ఫారాల పంపిణీ, నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించి అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాచర్ల కుమారస్వామి మాట్లాడుతూ, ప్రతి ఓటరు బిఎల్ఓల ద్వారా అందజేసిన ఎస్ఐఆర్ ఫారాలను పూర్తిగా నింపి, నిర్ణీత గడువులోగా తిరిగి బిఎల్ఓలకు అందజేయాలని కోరారు. ఫారాలు సమర్పించకపోతే ఓటరు జాబితాలో పేరు తొలగిపోయే అవకాశం ఉండవచ్చని ప్రజలకు అవగాహన కల్పించారు. అందువల్ల ప్రతి ఒక్కరూ ఈ ప్రక్రియను నిర్లక్ష్యం చేయకుండా సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శనిగరం ఐలయ్య, గ్రామ కార్యదర్శి మోహన్, వార్డు సభ్యులు వెంకటేశ్వర్లు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా బండి సంజయ్ జన్మదినం

## కొత్తకొండ వీరభద్ర సన్నిధిలో ప్రత్యేక పూజలు



**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్ కుమార్ జన్మదిన వేడుకలను భీమదేవరపల్లి మండల భారతీయ జనతా పార్టీ శాఖ ఆధ్వర్యంలో శనివారం మండలవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొత్త కొండ శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. బండి సంజయ్ కుమార్ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, దేశ సేవలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుతూ వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ముల్కనూర్ అంబేద్కర్ చౌరస్తాలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కేక్ కట్ చేశారు. ఒకరికొకరు స్వీట్లు తినిపించుకుంటూ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. బాణాసంచా కాలుస్తూ సంబరాలు నిర్వహించడంతో చౌరస్తా పరిసరాలు పండుగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి. ఈ సందర్భంగా మండల బీజేపీ అధ్యక్షుడు శ్రీరామోజు శ్రీనివాస్ మాట్లాడుతూ, తెలంగాణలో భారతీయ జనతా పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న నాయకుడు బండి సంజయ్ కుమార్ అని పేర్కొన్నారు. కొత్తకొండ వీరభద్రస్వామి ఆశీస్సులతో ఆయన ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కలగాలని ఆకాంక్షించారు. భీమదేవరపల్లి మండల ప్రజలు, పార్టీ కార్యకర్తల మద్దతు ఆయనకు ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు దొంగల కొమురయ్య, భీమదేవరపల్లి సర్పంచ్ మాచర్ల కుమారస్వామి, రసూల్‌పల్లె సర్పంచ్ బోయినీ మహేష్, గుండెల్లి సదానందం, పయ్యావుల రాజు, కంకణ సదానందం, మేకల రాజు, తీగల రాజు, శనిగరపు ఐలయ్య, లక్కిరెడ్డి మల్లారెడ్డి, ములుగు సంపత్, రామారావు భద్రయ్య, అయిత సాయితేజ, దొంగల రానా ప్రతాప్, బొల్లంపల్లి శ్యామ్, సింగం రాజేందర్, రామారావు అర్జున్, గణేష్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

### అక్కన్నపేటలో...

సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండల కేంద్రంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. అక్కన్నపేట మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు రామంచ మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో కేక్ కట్ చేసి, ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షుడు మోహన్ నాయక్, అసెంబ్లీ సహకన్వీనర్ జనగామ వేణుగోపాలరావు, జిల్లా కౌన్సిల్ సభ్యుడు కర్ణకంటి నరేష్, మండల ప్రధాన కార్యదర్శి చెరుకు సంపత్, బీజేపీ నాయకులు గూగులోతు తిరుపతి నాయక్, జంగపల్లి శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు మలోత్ రాజ్ నాయక్, బానోతు రవీందర్, ఉపసర్పంచ్ అర్జున్ నాయక్, మాజీ ఉపసర్పంచ్ వేముల ప్రసాద్, సంక్రే సంతోష్, కొండ్ల సంజీవరెడ్డి, జన్నరపు కళ్యాణ్, లౌడియా రైనా నాయక్, భూక్య తిరుపతి నాయక్, మాలోత్ సంతోష్ నాయక్, కందుకూరి జగదీశ్వర్ చారి, రాజు, వేముల శ్రీనివాస్, మోత్కులపల్లి రాజు, మిట్టపల్లి కుమారస్వామి, బొంకురి రజనీకాంత్, అవుల కుమార్, మిట్టపల్లి సత్యనారాయణ, గుండ్ల అశోక్, వేమూగంటి తేజ, ముక్కెర అఖిల్, నేతుల అభిలాష్ పాల్గొన్నారు.

# సీసీ రోడ్డు పనులు ప్రారంభం



**అక్కన్నపేట, మన చౌరాస్తా :** గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తూ ఉపాధి హామీ పథకం నిధులతో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా అక్కన్నపేట మండలంలోని చౌడు తండాలో నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శనివారం ఘనంగా శంకుస్థాపన చేశారు. మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి నాణ్యమైన రహదారులు అత్యంత అవసరమని అన్నారు. ఉపాధి హామీ పథకం నిధులను సమర్థవంతంగా వినియోగిస్తూ గ్రామాల్లో అంతర్గత రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టి నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు, నిర్వాహకులకు సూచించారు. సీసీ రోడ్డు నిర్మాణంతో గ్రామ ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం అవుతాయని, వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు తొలగిపోతాయని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అక్కన్నపేట మండల అధ్యక్షుడు రామంచ మహేందర్ రెడ్డి, సిద్దిపేట జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షుడు మోహన్ నాయక్, స్థానిక ఉపసర్పంచ్ గూగులోతు అర్జున్ నాయక్, మండల ప్రధాన కార్యదర్శి చెరుకు సంపత్, సక్ర సంతోష్, వార్డు సభ్యుడు దత్తాత్రేయ, సంతోష్, తిరుపతి రాజు, గ్రామ పెద్దలు లింగ నాయక్, బిక్య నాయక్, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# బీజేపీ సిద్ధిపేట జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఖమ్మం వెంకటేశ్ నియామకం



**కోహెడ, మన చౌరాస్తా :** భారతీయ జనతా పార్టీ సిద్ధిపేట జిల్లా ప్రధాన కార్యదర్శిగా కోహెడ మండల కేంద్రానికి చెందిన ఖమ్మం వెంకటేశ్ నియమితులయ్యారు. ఈ విషయాన్ని జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సిద్ధిపేట జిల్లా బీజేపీ కార్యవర్గాన్ని 20 మంది సభ్యులతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా అవకాశం కల్పించిన పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి, ముఖ్యంగా జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్, ఎంపీ రవీందర్ రావుతో పాటు తనకు అండగా నిలిచిన నాయకులు, కార్యకర్తలందరికీ ఖమ్మం వెంకటేశ్ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతం కోసం జిల్లాలో సమష్టిగా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

### జిల్లా ఉపాధ్యక్షుడిగా మాచర్ల కుమారస్వామి



**భీమదేవరపల్లి, మన చౌరాస్తా:** భారతీయ జనతా పార్టీ సిద్ధిపేట జిల్లా కమిటీలో భీమదేవరపల్లి సర్పంచ్ మాచర్ల కుమారస్వామిని జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించారు. ఈ సందర్భంగా తనపై పార్టీ నాయకత్వం ఉంచిన విశ్వాసానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవకాశాన్ని కల్పించిన కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌కు, నియామకానికి ఆమోదం తెలిపిన భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావుకు, జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్‌కు, అలాగే పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల నాయకత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు, కార్యకర్తలకు అండగా నిలిచేందుకు, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ అంకితభావంతో పనిచేస్తానని మాచర్ల కుమారస్వామి పేర్కొన్నారు.



# భీమదేవరపల్లి బడికి వాటర్ కూలర్ విరాళం

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** భీమదేవరపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్వచ్ఛమైన చల్లని తాగునీరు అందించాలనే లక్ష్యంతో రూ.50 వేల విలువైన 80 లీటర్ల సామర్థ్యం గల బ్లూ స్టార్ వాటర్ కూలర్‌ను శనివారం నాడు దాతల సహకారంతో ఏర్పాటు చేశారు. ఈ సేవా కార్యక్రమానికి మార్పాటి వెంకట రాజి రెడ్డి, మార్పాటి జయప్రకాశ్ రెడ్డి, మార్పాటి ప్రదీప్ రెడ్డి, మార్పాటి ప్రవీణ్ రెడ్డి ఆర్థిక సహకారం అందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఎన్. భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని దాతలు అందించిన ఈ సహాయం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. సమాజంలో మరింత మంది దాతలు విద్యాభివృద్ధికి చేయూతనివ్వాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎన్. భాస్కర్ రెడ్డి, ఉపాధ్యాయులు సుధారాణి, ప్రదీప్ కుమార్, రాజేంద్రం, మోహన్, శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొని దాతలను ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే విద్యార్థులు సైతం దాతలకు ధన్యవాదాలు తెలియజేశారు.

# రఘునాథపల్లిలో యువకుడి మృతి



**రఘునాథపల్లి, మన చౌరాస్తా :** హైదరాబాద్–వరంగల్ జాతీయ రహదారిపై రఘునాథపల్లి మండల కేంద్రం వద్ద శనివారం సాయంత్రం ఓ యువకుడు మృతి చెందాడు. మృతుడు హనుమకొండ జిల్లా కాజీపేటకు చెందిన సోమ సురేందర్ (23)గా గుర్తించారు. తిరుపతి నుంచి తిరిగి వస్తుండగా ఈ ఘటన జరిగినట్లు సమాచారం. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

# wanted

## విలేకరులు కావలెను




మన చౌరాస్తా తెలుగు దినపత్రిక స్థాపించిన అనతి కాలంలోనే పాఠకుల విశేష ఆదరణ పొందుతూ డిజిటల్ మీడియా రంగంలో దూసుకెళ్తోంది. స్థానిక సమస్యలపై, రాజకీయ, ఎడ్యుకేషన్, ఆరోగ్యం, సినిమా వార్తలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతూ ముందుకు సాగుతోంది. మా పత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను.. పూర్తి వివరాలకు ఈ కింది నంబర్లలో సప్రదించగలరు.

**manachourasta@gmail.com**

**8555800812** **9676400812**

Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**